వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుకు పుంగనూరులో ఉన్న కళాశాలలో అడ్మిషన్ల దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ నసీరుద్దీన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిప్లమా కోర్సులకు ఆన్లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు డిప్లమోలో ప్రవేశం కొరకు అర్హులు, కోర్సుకాల వ్యవధి రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు. తరగతులు ఇంగ్లీష్ మీడియంలో బోధించబడుతుందని వివరించారు. పదవ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక చేయబడునని చెప్పారు. డిప్లమో కోర్సు పూర్తి అయిన తర్వాత విద్యార్థులుకు విద్యతో పాటు ఉపాధి అవకాశాలు ఉన్నందున విద్యార్థులు వారి తల్లిదండ్రులు గమనించి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాల కోసం9966505285 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

కష్టం రైతులకు.. లాభం కంపెనీలకు..

- నష్టాల్లో "కోళ్ల" ఫారం రైతులు
- పెరిగిన ఖర్చులు.. తగ్గిన ఆదాయం
- ఎండాకాలంలో అదనపు భారం
- దక్కని గిట్టుబాటు ధరలు

ప్రజాశక్తి-వికోట: భానుడి ప్రకోపానికి అల్లాడిపోతున్న ఈ వేసవిలో కోళ్ల ఫారాల రైతులు కష్టాలు, నష్టాలు వర్ణనాతీతం. రోజు రోజుకు పెరిగిపోతున్న ఎండలతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతూ నానాటికి భూగర్భ జలాలు అడుగంటుపోతున్న తరుణంలో జనాలతో పాటు జీవాలు కూడా తల్లడిల్లిపోతున్నాయి. ముఖ్యంగా ఈ వేసవిలో లక్షలు వ్యయంతో నిర్మించిన కోళ్ల ఫారాలు రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేస్తున్నాయి.

పెరిగిన ఖర్చులు తగ్గిన ఆదాయం

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయం లాభసాటిగా సాగడం లేదు. కూలీలకు కూడా గిట్టుబాటు కాని తరుణంలో కొంతమంది రైతులు లక్షలాది రూపాయలు అప్పులు చేసి కోళ్ల ఫారాలు నిర్మించుకుంటున్నారు. గతంలో లాభసాటిగా సాగిన కోళ్ల పెంపకం ఈ వేసవిలో రైతులకు తీవ్ర నష్టాలతో నెట్టు కొస్తున్నారు. ఉష్ణ తాపాన్ని తగ్గించేందుకు రైతులు ఫారాల్లో నానా అవస్థలు పడు తున్నారు. షెడ్ల లోపల ఫ్యాన్లు, ఫాగర్లు, షెడ్ల పైన ఆకులు కప్పడం, వాటిపైన స్ప్రింక్లర్లను బిగించడం, షేడ్ చుట్టూ నీడకు పందిళ్లు వేయడానికి ఖర్చులు పెరిగి తడిసి మోపెడ వుతోంది. వీటికి తోడు షేడ్ లోపల వేసే వరిపొట్టు లభ్యత తగ్గడంతో డిమాండ్ పెరిగి సరఫరా ధరలు

పెంచేశారు. దీనితో ఒక బస్తా వరి పొట్టుపై రూ.60 ఆదనపు భారం పడింది. నాడు బొగ్గులు 1బస్తా రూ.300 కాగా నేడు రూ. 900లకు చేరింది. గతంలో ఒక కోడి పిల్లకు మేపడానికి ఒక రూపాయి ఉన్న కూలి నేడు మూడు రూపాయలకు పెరిగింది. వీటితో పాటు విద్యుత్ వాడకం పెరగడంతో ఛార్జీలు కూడా పెరిగాయి. అదనంగా మందులు ఖర్చులు పెరిగిపోయాయి. వేడిని తట్టుకోలేక అధిక సంఖ్యలో కోళ్ళ చనిపోతున్నాయి. చేతికందే సమయంలో కళ్ళు ఎదుటే కోళ్ల చనిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు అల్లాడిపోతున్నారు.

రైతులకు దక్కని గిట్టుబాటు ధర

వేసవికాలంలో ఆదనపు పని భారంతో పాటు ఖర్చు పెరిగి దిగుబడి వచ్చినా కోళ్ల ఫారం నుంచి మోతాదుకు మించి కోళ్ళ చనిపోతున్నాయి. దీని ప్రభావం ప్రొడక్షన్ కాస్ట్‌పై పడుతోంది దీనికి తోడు రైతులకు చెల్లించే రేటు పడిపోతున్నాయి. వాతావరణంలో వచ్చే మార్పులు కోళ్లలో ఎదుగుదల తగ్గి మరణాల శాతం పెరిగిపోయింది. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

కంపెనీలు సిండికేట్..

కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. లక్షలు వెచ్చించి వేసుకున్న కోళ్ల ఫారాల రైతులను కొన్ని కంపెనీలు చిన్నచూపు చూస్తున్నాయి. కష్టపడి కోళ్ళు మేపినా సక్రమంగా ఉత్పత్తి రాకపోతే రైతులకు చెల్లించే బిల్లులోనే కొన్ని కంపెనీలు డబ్బులు కోత విధిస్తు న్నారు. మరికొన్ని కంపెనీలు పంట కోల్పోయిన రైతులకు ముష్టి వేసినట్లు ఒక కేజీకి మూడు రూపాయలు మరికొన్ని కంపెనీలు రు.6.50 వరకు ఫిక్స్ చేసి డబ్బులు చెల్లిస్తున్నారు. లిఫ్టింగ్ సమయానికి చేయకుండా పది రోజులు అదనంగా కోళ్ల పెంచినా అదనపు పని దినాలు పెరిగి అది రైతులకు భారంతో పాటు నష్టాన్ని మిగుల్చున్నాయి. దీనికి తోడు మరల కోడి పిల్లలు నెలలు గడచినా ఇవ్వకపోవడంతో రైతులను మరింత ఇబ్బందులు తప్పడం లేదు. కోడి పిల్లలు ఫారంలోకి దిగినప్పటి నుంచి పెరిగి బయటకు వెళ్లే వరకు అన్ని ఖర్చులు రైతుల పైనే పడుతున్నాయి. దీనితో లాభాలు కంపెనీలకు, శ్రమ, ఖర్చులు రైతులకు మిగులుతున్నాయి. కొంతమంది అప్పులు చేసి సొంతంగా కోళ్ల పెంచేందుకు ప్రయత్నించినా మార్కెటింగ్ వద్ద కంపెనీల సిండికేట్‌తో ధరలు వ్యత్యాసాలతో సకాలంలో అమ్ము కోలేక తీవ్రంగా నష్ట పోతున్నారు. దీనితో రైతులు చేసేది లేక మరల కంపెనీల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కరువైన ప్రభుత్వ ప్రోత్సాహం

కోళ్ల పరిశ్రమను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యుత్ చార్జీలను కమర్షియల్ నుంచి తొలగించి వ్యవసాయ రంగానికి అందిస్తున్నట్లు రాయితీలు అందించాలని రైతులు కోరుతున్నా అమలుకు నోచుకోలేదు. యువతను ప్రోత్సహించడానికి ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి ప్రభుత్వం చిన్న పరిశ్రమల శాఖ ద్వారా నూతన షెడ్లు వేసు కునేవారికి సబ్సిడీలతో బ్యాంకు రుణాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. రైతులకు కనీస ధరలు నిర్ణయించి సక్రమంగా వాటిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కోళ్ల ఫారాలకు అవసరమైన వస్తు పరికరాలను సబ్సిడీపై అందించాలని కోరుతున్నారు. కోళ్ల రైతులను జిఎస్టి నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

పంటలపై భీకర దాడులు



టమోటా పంటను చూపుతున్న రైతులు

వరిపైరును తొక్కిసిన ఏనుగులు

ప్రజాశక్తి-సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ వడ్డీపల్లె గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, హరినాథ్, జయరాం అనే రైతులకు చెందిన వరి, టమోటా పంటలపై 16ఏనుగుల గుంపు దాడి చేశాయి. పంట నష్టపోయిన రైతులు శుక్రవారం తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వడ్డీపల్లె సమీపంలోని బుడ్డరెడ్డి గారిపల్లె వంక ప్రక్కన సాగు చేసిన టమోటా, వరి పైరును గురువారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు దాడి చేసినట్టుగా రైతులు చెబుతున్నారు. పంట పొలాలపై ఏనుగులు దాడి చేసిన ప్రాంతానికి కూత వేటు దూరంలోనే వడ్డీపల్లె గ్రామం ఉంది. రైతులు రాత్రిపూట పంటలకు నీరు పెట్టేందుకు పొలాల వద్దకు వెళ తుంటారు. రాత్రి వేళల్లోనే నీరు పెట్టి తిరిగి ఇళ్లకు చేరుకుంటూ ఉంటారు. ఇలా రాత్రి వేళలో రైతులు పొలాలకు వెళ్లి వచ్చే సమయంలో కానీ పొలాల వద్ద ఉండే సమయంలో కానీ ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి పంట నష్టం అటు ప్రాణ నష్టం కలిగిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు. ఏనుగుల గుంపు గ్రామాలలోకి వచ్చి వీధులలో సంచరించిన సందర్భాలు కూడా మండలంలో అక్కడక్కడ జరిగినవే. అలా వీధుల్లోకి వచ్చి రాత్రి వేళల్లో ప్రాణం నష్టం ఆస్తి నష్టం చేయకుండా పంట పొలాలపై కూడా దాడి చేయకుండా ఏనుగుల మందను అటవీ ప్రాంతంలోకి తరిమివేయాలని ఇందుకోసం అటవీ శాఖ అధికారులు తమ వంతు బాధ్యతను నెరవేర్చాలని ప్రజలు రైతులు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

కౌంటింగ్ విధులు సక్రమంగా నిర్వహించాలి: జెసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్ట్రాంగ్ రూమ్స్ నుంచి కంట్రోల్ యూనిట్స్, బ్యాలెట్స్ యూనిట్స్‌ను కౌంటింగ్ కేంద్రాలకు జాగ్రత్తగా పంపించాలని జేసీ, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సమావేశం హాల్ నందు చిత్తూరు, గుడిపాల తహశీల్దార్లు, ఏఆర్‌ఓలు శ్రీనివాసులురెడ్డి, విజయలక్ష్మిలతో కలిసి 4న ఎస్‌వి సెట్‌లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి ఓట్లు లెక్కింపు కేంద్రంలో విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది నిర్వహించవలసిన విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 4న ఎస్‌వి సెట్‌లో చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి ఓట్లు లెక్కింపు ప్రక్రియలో భాగంగా స్ట్రాంగ్ రూమ్స్, సీలింగ్ రూమ్స్ దగ్గర ఉన్న ఇన్‌ఛార్జ్‌లు జాగ్రత్తగా సియు, బీవీలను కౌంటింగ్ కేంద్రాలకు పంపించే ముందు కౌంటింగ్ అయ్యిన తర్వాత సీలింగ్ రూమ్స్‌లో భద్రపరిచేటప్పుడు తప్పని సరిగా రిజిస్టర్‌లో నమోదు చేసి సంబందితా వారి నుంచి సంతకాలు తీసుకోవాలని స్ట్రాంగ్, సిల్లింగ్ రూమ్స్ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించారు. నియోజకవర్గానికి సంబందించి ఓట్లు లెక్కింపు కోసం 14టేబుల్స్‌ను, పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపునకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, టేబుల్స్ వద్ద స్టేషనరీ తోపాటుగా అన్ని రకాల ఫార్మేట్స్, పిఎస్‌ల వారిగా పోల్ డేటా, 17సి అన్నీ సిద్ధంగా ఉంచాలన్నారు. 3న మధ్యాహ్నం కల్లా అన్ని కార్యక్రమాలు పూర్తి చేయాలని ఏఆర్వోలను ఆదేశించారు. ఎవ్వరికి కేటాయించిన విధులను చిన్న పొరపాట్లకు తవులేకుండా జాగ్రత్తగా నిర్వహించాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో చిత్తూరు రూరల్ తహశీల్దార్‌లు షేక్ హసినాబి, డిటిలు, కిరణ్ కుమార్, హిమగిరి, ధనంజయలు, ఏఎస్ఓ సౌందర రాజన్, సర్వేయర్ సునీత, ఆర్ఐ సాయిరామా తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్‌లకు పింఛన్‌ల జమ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జూన్ నెల సామాజిక పింఛన్‌లు బ్యాంకు అకౌంట్‌లకు జమ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. బ్యాంక్ అకౌంట్లు లేని వారికి, 80 సం.లు దాటిన వద్దులకు, ఇతర రాష్ట్రాలలోని కో-ఆపరేటివ్ బ్యాంకులలో ఖాతా వున్న వారికి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పింఛన్‌లను పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 2,72,223మంది లబ్దిదారులకు సుమారు రూ.79.66 కోట్లు సామాజిక పెన్షన్‌ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. లబ్దిదారులకు సుమారు రూ.79.66కోట్లు సామాజిక భద్రత పింఛన్‌లు 1 నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

"ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం" ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటప్రసాద్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లా ఇన్‌ఛార్జ్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మార్కెట్ చౌక్ వరకు పొగాకు వాడకం ద్వారా కలిగే అనర్ధాలపై నినాదాలుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంవత్సరం యొక్క నినాదం "పొగాకు పరిశ్రమల జోక్యం నుంచి పిల్లలను రక్షించండి" అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్లడం జరిగింది. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, హాన్స్, పాన్ పరాగ్, నశ్యం, చుట్ట, వీటిలో దేనిని వాడిన నికోటిన్ అనే హానికరమైన పదార్థం రక్తంలో కలిసి వివిధ రకాల క్యాన్సర్లు, గుండెజబ్బులు, స్ట్రోక్స్, శ్వాసకోశ వ్యాధులకు గురై చనిపోవడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, డిపిఎమ్‌వో డాక్టర్ హర్షవర్ధన్, ఎన్‌సిడి కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, ఎస్‌వో జార్జ్, హెచ్‌ఈవో గుణశేఖర్, డెమో జయరాముడు, ఎపిడి మియోలాజిస్ట్ శ్రీవాణి, డిపిఓ రామ్మోహన్, హెచ్‌ఈ రాజేంద్రప్రసాద్, డిఐసిపిఓ దాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. ఘన వీడ్కోలు

పోలీసులను సన్మానిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఈ నెల ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ మాధవ నాయుడు, మూర్తి, పట్టాబిలకు ఎస్పీ మణికంఠ సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ దాదాపు 42సం. పాటు అంకిత భావంతో అందించిన సేవలను పోలీసుశాఖ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. పోలీసు డిపార్టుమెంటు నందు పనిచేయడం సవాలుతో కూడుకొన్నదని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి నిబద్ధతతో విధులు నిర్వర్తించినందుకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. విధుల్లో చేరిన నాటి కాలంలో అప్పటి పరిస్థితులను తట్టుకుని కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తించడం మామూలు విషయం కాదన్నారు. ఉద్యోగ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో గడుపుతూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో గడపాలని, కుటుంబ సభ్యులతో ఈ ప్రయాణం సుఖ సంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. పదవీ విరమణ తర్వాత కూడా పోలీసు కుటుంబంలో సభ్యులేనని, ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు.

ఎగ్జిట్ పోల్స్ వివరాలు వచ్చినప్పుడు ఇళ్లలోనే ఉండాలని

- కౌంటింగ్ పూర్తయ్యే వరకు రోడ్లపైకి రావొద్దు
- ఎస్పీ మణికంఠ చందోలు హెచ్చరిక

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎగ్జిట్ పోల్స్ వివరాలు వచ్చినప్పుడు ఇళ్లలోనే ఉండాలని కౌంటింగ్ పూర్తయ్యే వరకు రోడ్లపైకి రావొద్దని ఎస్పీ మణికంఠ చందోలు కోరారు. జిల్లాలో 144సెక్షన్‌ను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. శాంతిభద్రతలపై రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎగ్జిట్ పోల్స్‌పై నిరాధార ఆందోళనలు అవసరం లేదన్నారు. అధికారిక ఫలితాలు వచ్చే వరకు ఓర్పు పాటించాలని సూచించారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ రేపు వెలువడనున్న నేపథ్యంలో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ వివరాలు వచ్చే సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండాలని, ఎన్నికల సమయాల్లో శాంతి భద్రతలు కాపాడడం చాలా ముఖ్యం, అందువల్ల, ఎగ్జిట్ పోల్స్ వచ్చినప్పుడే కాదు, కౌంటింగ్ పూర్తయ్యే వరకు కూడా రోడ్లపై ఎవరూ తిరగొద్దని కఠినంగా హెచ్చరించారు. శాంతిభద్రతలు పరిరక్షించడం అనేది పోలీసుల బాధ్యత, కానీ ఇందులో ప్రజలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. 144సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంగా ఒకే చోట నలుగురు లేదా అంతకన్నా ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడదని తెలిపారు.

కౌంటింగ్ రోజున ట్రాఫిక్ ఆంక్షలు

"కౌంటింగ్ రోజున శాంతిభద్రతలు కాపాడేందుకు ట్రాఫిక్ ఆంక్షలు అనివార్యం. ప్రజలు సహకరించాలని కోరుతున్నాం" ఎస్పీ మణికంఠ చందోలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీన రాష్ట్రమంతటా జరగనున్న కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా చిత్తూరు జిల్లాకు సంబంధించి ఎస్‌వి సెట్ కాలేజీలో జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ మళ్లింపుల వివరాలు:

- చిత్తూరు నుండి తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాద్‌కు వెళ్లవలసిన వారు ఇరువారం వైపుగా వెళ్లి అక్కడినుండి కాఫీ డే (వరిగపల్లి) జంక్షన్ నుంచి కుడివైపుకు తిరిగి 6 లైన్ హైవే తీసుకోగలరు.
- చెన్నై, వేలూరు నుంచి చిత్తూరు మీదుగా తిరుపతి, కడప, పీలేరు లేదా హైదరాబాద్ వెళ్లాలనుకునేవారు రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి కాఫీ డే (వరిగపల్లి) జంక్షన్ వద్దకు వెళ్లి అక్కడి నుంచి కుడి వైపు తిరిగి 6 లైన్ హైవే నుంచి వెళ్లగలరు.
- తిరుత్తని నుంచి చిత్తూరు మీదుగా తిరుపతికి వెళ్లవలసిన వారు తానా జంక్షన్ నుంచి జీడీ నెల్లూరు పోలీస్ స్టేషన్ మీదుగా పుత్తూరు రోడ్డును వినియోగించుకొని తిరుపతికి చేరుకోగలరు.
- తిరుత్తని నుంచి వేలూరు గాని, చెన్నైకి లేదా బెంగళూరుకు వెళ్ళవలసిన వారు చిత్తూరు పట్టణం మీదుగా వెళ్ళవలెను.
- కడప, పీలేరు-తిరుపతి నుంచి చిత్తూరుకు రావాలనుకున్న వారు రంగంపేట 6లేన్ హైవే ఫ్లై ఓవర్ నుంచి ఒరిగిపల్లి జంక్షన్ మీదుగా చిత్తూరుకు చేరుకోగలరు.
- వావిలతోట-బండపల్లి-పూతలపట్టు, ఇతర చిన్న చిన్న గ్రామస్తులు చిత్తూరుకు రాదలచిన వారు వారికి సమీపంలో ఉన్న లేన్ హైవే ఫ్లై ఓవర్ నుంచి కాఫీ డే (వరిగపల్లి) జంక్షన్ మీదుగా చిత్తూరుకు చేరుకోగలరు.
- తిరుపతి నుంచి చిత్తూరుకు వచ్చే వారికి పెనుమూరు రోడ్డు పూర్తిగా నిషేధం రంగంపేట ఫ్లై ఓవర్ క్రాస్ నుంచి మురకంబట్టు వరకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిషేధం.
- కౌంటింగ్ సిబ్బంది, అధికారులు, అభ్యర్థులు మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు.
- 2వ గేట్ ద్వారా హాస్పిటల్ వెనుక వైపు ఖాళీ ప్రదేశంలో పార్కింగ్ అనుమతిస్తామని పేర్కొన్నారు.
- ఏజెంట్లు, పోలీసు, ప్రెస్ వారి వాహనాల కోసం మహర్షి పాఠశాల ఆవరణలో, పక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.
- పూతలపట్టు నుంచి వచ్చే వాహనం ఎడమ వైపు సర్వీస్ రోడ్డులో అండర్ పాస్ ద్వారా నేరుగా పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవచ్చు, మురకంబట్టు వైపు నుంచి వచ్చే వాహనాలు కుడి మలుపు తిరిగి, ఆపై ఎస్‌వి నర్సింగ్ కళాశాల హాస్టల్ వద్ద కుడి రహదారిపై నుండి మహర్షి పాఠశాల పార్కింగ్ స్థలం వైపు వెళ్లవచ్చునని వివరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గుణశేఖర్ రెడ్డి, సుశీలమ్మ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి: డీఆర్‌వో



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రెవిన్యూ శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసిన గుణశేఖర్, సుశీలమ్మ సేవలు మరువలేనివని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మెజిస్ట్రీరియల్ సెక్షన్ పర్యవేక్షకులు కె.గుణశేఖర్ రెడ్డి, ఎలక్షన్స్ కో-ఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు సుశీలమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. పలువురు వారి సేవలను కొనియాడారు. డ్వామా పీడీ రాజశేఖర్, గుణశేఖర్ రెడ్డి, సుశీలమ్మ, జిల్లా రెవిన్యూ అసోసియేషన్ సభ్యులు హుస్సేన్, పార్థసారథి, రాజు పాల్గొన్నారు.

సీజన్‌లోనూ బోసిపోయిన మార్కెట్ యార్డులు

మామిడికాయలేవీ..

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: మామిడి రుచులకు పెట్టిందిపేరు చిత్తూరు జిల్లా. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మామిడి ఎక్కువగా పండే అవకాశాలున్నాయి. అందుకే జిల్లాలో మామిడి రైతులు విస్తారంగా వాణిజ్య పంటగా మామిడి పండిస్తున్నారు. ఏటా మామిడి రైతులు నష్టపోతున్నారు. గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతూ కలెక్టరేట్ ఎదుటే తాము పండించిన మామిడి కాయలను పోసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరిన దృశ్యాలు చూశాం. మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలంటూ చిరకాలంగా మామిడి రైతులు కోరతున్నారు. మామిడి గుజ్జు పరిశ్రమలు సిండికేట్ అయి ధరలను నియంత్రించడం తోతాపూరి రకం టన్ను రూ.25వేల నుంచి రూ.30వేలకు మించి అమ్ముడు పోని పరిస్థితి..

తగ్గిన కాపు..

ఈ ఏడాది కాపు పూర్తిగా తగ్గిపోవడంతో మామిడి రైతులు నిలువునా నష్టాల్లో మునిగిపోయారు. జిల్లాలో దాదాపు లక్షా 25వేల హెక్టార్లలో మామిడి సాధారణ సాగు ఈ ఏడాది కనీసం 10శాతం కూడా మామిడి ఫలసాయం అందలేదు. జిల్లాలోని ప్రధాన మామిడి మార్కెట్ యార్డులు దామలచెరువు, బంగారుపాళ్యం, చిత్తూరు మార్కెట్ యార్డులు బోసిపోయి కనిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడ చూసిన మామిడి తోటలు ఒకటి అర కాయలతో కనిపించడమే ఇందు కారణం. జూన్ మాసం చివరి వరకు మామిడి సీజన్ ఉంటే మే మాసంలోనే కాయలు లేక మార్కెట్ యార్డులో ట్రేడర్లు కాయల కోసం ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.10లక్షల హెక్టార్లలో మామిడి తోటల నుంచి ఏడాదికి సగటున తొమ్మిది లక్షల టన్నుల కాయల దిగుబడి ఉంటుంది. జిల్లాలో 60కిపైగా మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. మామిడి సాగుపై ఆధారపడి 1.5లక్షల కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయి.

ధరలు పెరుగుతాయనే ఆశ

పంట తగ్గడంతో గిట్టుబాటు ధర పలుకుతుందని రైతులు ఆశపడుతున్నారు. గతంలో ఎందుకూ పనికిరాని నాటు రకాల కాయలు సైతం టన్ను రూ.12వేలు పలుకుతోంది. అందులోనూ సాధారణ కాయలు, రకాలంటూ వేరు చేసి నాణ్యమైన ధరతో కొంటున్నారు. బయటి రాష్ట్రాల వ్యాపారులు ఇప్పటికే జిల్లాలో కొనుగోలు ప్రారంభించారు. ఏటా విస్తారంగా పండే తోతాపురి రకం కాయలు ఈ ఏడాది ఏమాత్రం పంట లేకపోవడంతో గుజ్జు పరిశ్రమలు కూడా ఈ ఏడాది తెరుకొనే అవకాశాలేవని గుజ్జు పరిశ్రమల యజమానులు అంచనా వేస్తున్నారు. పక్క రాష్ట్రలో కూడా ఇదే పరిస్థితికావడంతో జిల్లాలో అంతత మాత్రంగా ఉన్న మామిడికి మంచి ధర వచ్చే అవకాశాలుంటాయని మామిడి రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం అంటే శుక్రవారం చిత్తూరు మామిడి మార్కెట్‌లో తోతాపూరి టన్ను రూ.25వేల నుంచి రూ.30వేలు, ఖాదర్ రూ.46వేలు, ఖాదర్ రంగు రూ.50వేలు, పుల్లూరా రంగు రూ.34వేలు, పుల్లూర గుజ్జు రూ.20వేలు, బేనిషా రూ.35వేలు, బేనిషా రంగు రూ.45వేలు, నాటు రూ.12వేలు, నాటు రంగు రూ.20వేలు టన్ను అమ్ముడుపోతోంది.

6,7 కాయలు లేక పోసిపోయిన చిత్తూరు మామిడి మార్కెట్ యార్డు

నేడు ద్రౌపది కళ్యాణం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ భారతం మిట్టలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం ద్రౌపతి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమల సమీపంలోని తిరుపతి రోడ్డు నందు గల అతిపెద్ద అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద హనుమజ్జయంతి వేడుకలను శనివారం నిర్వహిస్తున్నట్లు అక్కడి నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తీర్థ ప్రసాద వినియోగం మధ్యాహ్నం 11 గంటల నుంచి అన్నప్రసాద వితరణ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యులు తెలిపారు.

జగన్ మరోసారి సీఎం కావాలని పూజలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: జగన్ మరో సారి సీఎం కావాలని మండలంలోని తార్లబైలు గ్రామస్తులు పూజలు నిర్వహించారు. శుక్రవారం గంగమ్మకు భక్తిశ్రద్ధలతో పొంళ్లు సమర్పించారు. రాష్ట్రానికి జగన్ సీఎం కావడంతో పాటు జీడీ నెల్లూరు ఎమ్మెల్యేగా కృపాలక్ష్మి అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని కోరుకున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మురళి రెడ్డి, యూత్ వైసిపి లీడర్ వాసుదేవ రెడ్డి, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

మండలానికి చేరిన డస్ట్‌బిన్‌లు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని 15 పంచాయతీ లకు సంబంధించి మొత్తం 18వేల డస్ట్ బిన్లను ప్రభుత్వ మంజూరు చేసింది. అవి శుక్రవారం మండలానికి చేరుకున్నాయి. ఎన్నికల ఫలితాల తరువాత పంపిణీ చేపడతామని ఎంపీడీవో నారాయణ, ఈవోఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. క్లాప్ క్లీన్ ఏపీ స్వచ్ఛ సంకల్పం పేరుతో ప్రభుత్వం మంజూరు చేసిన చెత్త డబ్బాలను తడి పొడి చెత్త వేసేందుకు వేరువేరుగా ఒక్కో ఇంటికి రెండు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నికల ఫలితాలు అనంతరం డస్ట్ బిన్ల పంపిణీ చేపడతామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, సుధాకర్ కుమార్, దివ్యభారతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

సన్మానం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ లెక్చరర్ మురళి పదవి విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన వ్యక్తికి పదవీ విరమణ తప్పదని, విధులు చేపట్టేటప్పుడు అధికారులు ప్రజల దగ్గర మన్నెలలు పొందాలని అప్పుడే ప్రభుత్వ ఉద్యోగికి గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం దుశ్శాలువలతో సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు గిరిబాబు, హసీనా, చంద్రమోహన్ రెడ్డి, మురళి, శ్రీనివాసులు పలువురు పాల్గొన్నారు.

బాధ్యతే కానీ.. స్వార్థం కాదు: ఎంఈవో

ప్రజాశక్తి-పూతలపట్టు: ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ఎవరినైనా కష్టపట్టి ఉంటే మన్నించాలి, అది బాధ్యతే కానీ అది స్వార్థంతో చేసిన పని కాదని ఎంఈవో కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన పదవి విరమణ సందర్భంగా ఎంఆర్‌సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. భావోద్వేగంతో మాట్లాడుతూ కన్నీరు మున్నీరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు ఆయన నిర్వహణపై వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గజమాలలు, సాలువాలతో ఘనంగా సన్మానించారు.

ధూమపానం అలవాటు అనారోగ్యానికి తొలి మెట్టు

- ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-సోమల: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. మత్తు పదార్థములు వద్దు ఆరోగ్యమే ముద్దు, పొగ త్రాగవద్దు క్యాన్సర్కు గురి కావొద్దు, మద్యం ధూమపానం వద్దు, పౌష్టికాహారమే ముద్దు అన్న నినాదాలతో సిహెచ్‌వో అమర్నాథ్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి పొగాకు ధూమపానం చేయడం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు.

అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సదుం: "ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం"పై చెరుకువారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీగిరీషా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది శుక్రవారం సదుం బస్టాండ్ కూడలిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. "పొగాకు తో నీ ఊపిరిని తీసుకోవదు" దూమపానం వలన క్షయ వ్యాధి ఎక్కువుగా సోకే ప్రమాదం ఉందని, క్షయ వ్యాధి ప్రపంచంలోనే అత్యంత ప్రమాధకరమని, ఆరోగ్యాన్ని ఎంచుకో.. పొగాకును కాదు అనే స్లోగన్స్‌తో ర్యాలీ చేపట్టారు. పొగాకు వాడకం వలన శరీరంలోని అన్ని అవయవాలు పాడవుతాయని వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమలత, ఆశా కార్యకర్తలు అరుణ, రెడ్డికుమారి, శకుంతల, సదుం మాజీ సర్పంచి సయ్యద్ బాషా, ఇందాద్ పాల్గొన్నారు.

మృగరాజుపై వేణుగోపాలుడి విహారం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం రాత్రి కాళ సర్పంపై నృత్యవేణుగోపాలుడుగా ముత్యపు పందిరి వాహనం. ఉదయం సింహవాహనంపై వేణుగోపాలుడు భక్తులను అనుగ్రహించారు. తెల్లవారు జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు అభిషేకం, శుద్ధి, తోమాల – అర్చన జరిపి తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. ఉదయం 7.30 గంటలకు వేద నరసింహ అవతారంలో స్వామివారు మృగరాజు అయిన సింహవాహనంపై కొలువుదీరి పురవీదుల్లో విహరిస్తూ భక్తులకు ధర్మన బాగ్యాన్ని కల్పించారు. అనంతరం రుక్మిణీ సత్యబామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు వేద మంత్రా నడుమ పాలు తేనె, పసుపు, వందనం గారికే లాలు వంటి సుంగంధ ద్రవ్యాలతో వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ అవతారంలోని శ్రీవేణుగోపాలునికి ఆలయ ఆవరణంలోని ఊంజల్ మండపంలో టీటీడీ బృధం గాత్ర కచ్చేరితో కనుల పండువుగా కాంజల్ సేవ నిర్వహించారు.

ముత్యపు పందిరిపై ఉభయ నాంచార్లుతో వేణుగోపాలుడు వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రుక్మిణి సత్యభామ సమేతుడై శ్రీవేణుగోపాలుడు ముత్యపు పందిరి వాహనంపై కొలువుదీరి చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల, మంగళవాయుధ్యాలు, నడుమ అత్యంత వైభవంగా పురువీధుల్లో ఊరేగారు. భక్తులు ఇంటింటా కర్పూర హారుతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 9.30 గంటలకు ఏకాంత సేవతో స్వామి వారిని పవళింప చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నగరత్నం, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయ అధికారి సురేష్‌కుమార్, బాబుసురేష్, కంకణభట్టుర్ నారాయణం దాసరథి, వేదపండితులు గోపాలాచార్యులు, తరుణ్‌కుమార్, అలంకారపండితులు మోహన బట్టాచార్యులు టీటీడీ సిబ్బంది భక్తులు తదితరలు పాల్గొన్నారు.

నేడు కళ్యాణోత్సవం

కార్వేటినగరంలో జరుగుతున్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు శనివారం ఉదయం కల్పవృక్షవాహనంపై ఊరేగ నున్న శ్రీవేణుగోపాలుడు, ఈ క్రమంలో ఆలయంలో సాయంత్రం 5 గంటల నుంచి 6.30 వరకు ఆర్జిత కళ్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్కుమార్ తెలిపారు, కళ్యాణోత్సవాలలో పాల్గొన దలచిన భక్తులు రూ.750 చెల్లించి దంపతులు, లేదా ఇద్దరు భక్తులు పాల్గొన వచ్చుని పేర్కొన్నారు. రాత్రి 7గంటల నుండి సర్వభూపాలవాహనంపై తిరువీధిఉత్సవం నిర్వహించ నున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం: ఎంపీపీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. శుక్రవారం బైరెడ్డిపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని గంగినాయన పల్లి పంచాయతీలో నీటి సమస్య, నూతన విద్యుత్ సర్వీస్ అవసరాన్ని సర్పంచ్ రేణుక శంకర్ రెడ్డి సమావేశంలో అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఆలపల్లిలో కొన్ని రోజులుగా విద్యుత్ ట్రాన్స్ఫారం మరమ్మతులకు లోనైతే గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువైందని ఈ విషయం విద్యుత్ శాఖ అధికారులకు తెలియపరచిన ఫలితం లేకపోయిందని సర్పంచ్ రమణారెడ్డి తెలిపారు. విద్యుత్ శాఖ అధికారుల పనితీరు మార్చుకోవాలని సూచించారు. అలాగే తీర్థం పంచాయతీలో తాగునీటి కోసం నూతన బోరు ఏర్పాటు చేయాలని సర్పంచ్, ఎంపీటీసీ కోరగా ఎంపీపీ రెడ్డప్ప సమస్య ఉన్న గ్రామాల్లో నూతన బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి గీత మాట్లాడుతూ పలు సూచనలు, పంటల సాగుకు సంబంధించి పలు అంశాలును సభలో వివరించారు.

ఆకట్టుకున్న బలి బండి ఉత్సవం

ప్రజాశక్తి-కార్వేటినగరం: కొల్లాగుంట గ్రామంలో వెలసి ఉన్న శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం బలి బండి కూడు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బక్కాసురునికి బండి కూడు తీసుకువెళ్లి, బక్కాసురుని భీముడు సంహరించే ఘట్టాన్ని హారికథా నాట్యమయూరి భాగవతారిణి ఉషారాణి భక్తులకు కనులకు కట్టినట్లుగా కథ కాలాక్షేపం చేయడం జరిగింది. దీంతో సాయంత్రం భీముని వేషదారుడు ఎడ్ల బండిపై బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టాన్ని వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో భారత మిట్ట జన సంద్రంగా మారింది. ఈ క్రమంలో భాగంగా గ్రామంలో మొక్కులున్న భక్తులు కూడా ఎడ్లబండ్లతో ఆలరించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ కమిటీ సభ్యులు వ్యవహరించారు. అంతకు ముందు ఆలయం మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టువస్త్ర. సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష, ఆభరణాలతో సుందంతంగా ఆలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి పుర వీధుల్లో మేళ తాళాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు.

కోడి వ్యర్థాలను తొలగించారు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండల కేంద్రంలో జాతీయ రహదారి ప్రక్కనే చికెన్ దుకాణదారులు వ్యర్థాలను వేస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంపై 'చికెన్ వ్యర్థాలతో కంపు' శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శుక్రవారం వ్యర్థాలను తొలగించారు. ఇకపై చికెన్ వ్యర్థాలను రోడ్డు ప్రక్కన వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించినట్లు పెద్దపంజాణి పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. అదేవిధంగా చికెన్ దుకాణదారులు తప్పకుండా పరిశుభ్రత పాటించి షాపు పరిసరాల్లో ఈగలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వారపు సంత పరిశీలన

ప్రజాశక్తి-పలమనేరు: ముందస్తు జాగ్రత్తలో భాగంగా నీటి ట్యాంకులు, వారపు సంతలను పరిశీలించి పరిశుభ్రం చేయిస్తున్నట్లు పురపాలక కమిషనర్ తెలిపారు. శుక్రవారం పలమనేరు పట్టణంలో పలు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారపు సంతలో ఆయన పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు: అడిషనల్ ఎస్పీ

ప్రజాశక్తి-పుంగనూరు: 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పలమనేరు ఇన్‌ఛార్జ్ డీఎస్పీ విష్ణురఘువీరతో కలిసి స్థానిక గోకుల్ సర్కిల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 144సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ర్యాలీలు, టపాసులు, విజయోత్స ర్యాలీలు పూర్తి నిషేధించినట్లు స్పష్టం చేశారు. పోలీసులకు ప్రజలందరూ సహకరించాలన్నారు. శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించకూడదని కోరారు. కార్యక్రమంలో పుంగనూరు అర్బన్ సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ మహమ్మద్ రఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: గ్రామాలలో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజకుల్లాయప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని పిల్లారి కుప్పం గ్రామపంచాయతీ పిల్లారి కుప్పం గ్రామంలో ఎస్ఐ రాజకుల్లయప్ప, సిబ్బందితో కలిసి పర్యటించారు. మండలంలో సమస్యాత్మక ప్రాంతాలైన పుల్లూరు, కొత్తపల్లి మిట్ట గ్రామాలలో ప్రతిరోజు గస్తీ నిర్వహిస్తున్నామని, కౌంటింగ్ రోజున పోలీస్ సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పాటు చేసి ఎస్ఆర్ పురం, ముద్దికుప్పం కొత్తపల్లి మిట్టరూట్‌లో మొబైల్ వాహనాల ద్వారా గస్తీ నిర్వహిస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రింక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామన్నారు. పల్లెల్లో ప్రశాంత వాతావరణంలో ఉండాలని ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

గంగవరం: నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ చిన్న గోవిందు అన్నారు. ఎగ్జిట్ పోల్స్ వివరాలు తెలియగానే ప్రజలు ఎల్లకే పరిమితం కావాలని హెచ్చరించారు. వివరాలు వెల్లడించిన తర్వాత గ్రామాలలో పట్టాకీలు కానీ బాణ సంచాల గాని పేల్చిన యెడల కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

ఆర్‌పిఎఫ్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి

న్యాయం చేయాలని బాధిత ప్రయాణికుడి అభ్యర్థన

ద్విచక్ర వాహనలకు తాళాలు వేసిన రైల్వే పోలీసులు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని ఆర్‌పిఎఫ్ పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై ఉన్నత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిఆర్ మండలం గ్రామానికి చెందిన బి కిరణ్ కుమార్ కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ తాను ప్రతిరోజూ పని నిమిత్తం ట్రైన్లో వెళ్లి వస్తున్నానని ఈ క్రమంలో ఈ నెల 28వ తేదీ ఉదయం వెళ్లడానికి రైల్వే స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్నానని తెలిపాడు. ఇంతలో ట్రైన్ ప్లాట్ ఫామ్‌పై వుండడంతో సమయం లేక ఆర్‌టిఆర్ ఏపీ జీరో త్రీ ఏపీ 41 45 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని రైల్వే స్టేషన్ ఎదుట పార్క్ చేసి ట్రైన్‌లో వెళ్లి పోయానని తెలిపాడు. దీంతో తన వాహనం నో పార్కింగ్ జోన్‌లో ఉందని పోలీసులు చైన్ సాయంతో తాళం వేశారని తెలిపాడు. రైల్వే స్టేషన్ మాస్టర్‌ను అడగగా ఎస్ఐ, ఏఎస్ ఐ వచ్చి నీకు ఫైన్ వేసి రిసిప్ట్ ఇస్తారని చెప్పి పంపారన్నారు. ఒక గంట తర్వాత స్టేషన్ దగ్గరకు వెళ్లి ఎస్ఐను కలవగా ఫైన్ వేసి రిసిప్ట్ ఇస్తే ఫైన్ కట్టి వెళతానని చెప్పానన్నారు. 'నువ్వు నీ వాహనాన్ని నో పార్కింగ్ జోన్‌లో పెట్టి వెళ్లావు..రూ.2వేలు ఇస్తే రిసిప్ట్ లేకుండా నీ బండిని ఇస్తాను.. లేకుంటే ఆధార్ కార్డు ఇస్తే నీపై కేసు పెడతాను..' అని బెదిరించార న్నారు. నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేస్తే 500 రూపాయలు ఫైన్ వేసేలా బోర్డులో వుందని తెలిపా నన్నారు. 'నువ్వు ఎవరికి చెబుతావో చెప్పుకో..రూ.2వేలు కడితేనే వాహనం వదులుతానని, లేదంటే కేసు పెడతానని ఆర్పిఎఫ్ పోలీసులు బెదిరించడంతో రూ.2 వేలు చెల్లించి 'వాహనాన్ని మీరే ఉంచుకోండి..' అని చెప్పి వచ్చేశానని తెలిపాడు. అదే రోజు తాను హైదరాబాద్ వెళ్లాల్సి ఉందని, ఈ స్టేషన్లో జరిగిన సమస్య వల్ల తాను మనస్థాపానికి గురై హైదరాబాద్‌కు వెళ్లలేక పోయానన్నారు. అందువల్ల తనకు 5 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని చెప్పారు. అందుకు పూర్తి బాధ్యత ఎస్ఐ వహించాలని తెలిపారు. ప్లాట్ ఫామ్ నంబర్ వన్‌పై టి ఎన్ 18 వి 88 98 నెంబరు గల రాయల్ ఎన్ఫీల్డ్ బండి రిష్టిక్టెడ్ ఏరియాలో పార్కు చేసిందని తెలిపాడు. దీనిపై చర్యలు తీసుకోరా? అని ప్రశ్నించాడు. తనలాంటి ఎంతో మంది ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తిస్తున్న ఆర్పిఎఫ్ పోలీసులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.

నర్సులు సేవా భావంతో మంచి పేరు తెచ్చుకోవాలి

కెకెసి కళాశాల ఛైర్మన్ కె కుప్పయ్య శెట్టి

కెకెసి నర్సింగ్ కళాశాల విద్యార్థినుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న అతిథులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నర్సులు సేవా భావంతో పనిచేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి కెకెసి కళాశాల ఛైర్మన్ కె కుప్పయ్య శెట్టి, వైస్ ఛైర్మన్ కె నరసింహారావు పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలం లోని పరమేశ్వర మంగళం పంచాయతీలోని కెకెసి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు చదువు పూర్తయిన వారికి వీడ్కోలు, మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రవేశ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాధమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కె కుప్పయ్యశెట్టి, కె నరసింహారావులు మాట్లాడుతూ వైద్యుల చికిత్స తరువాత స్వస్థత చేకూర్చడం నర్సుల సేవలపైనే ఆధారపడి ఉంటుందన్నారు. నర్సులు సేవా భావంతో పనిచేసి భావితరాలకు మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యు జ్యోతి రాణి, డాక్టర్ శరవణ, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సలహాదారులు దామోదరం, కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'టిడిపి విజయాన్ని ఆపలేరు..'

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాష్ట్రంలో టిడిపి విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని, విజయ కేతనం ఖాయమని మండల టిడిపి మాజీ అధ్యక్షుడు ఆరి లీలా మోహన్ నాయుడు అన్నారు. రఘునాథ రిసార్ట్సులో చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని ఆయన శుక్రవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజక వర్గంలో 25 సంవత్సరాల తర్వాత టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) 25 వేల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించి చంద్రగిరి కోటపై టిడిపి జెండాను ఎగరవేయడం తథ్యం అన్నారు. ఈ నెల 4వ తేదీ ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లో నాని మెజారిటీ ఓట్లు సాధిస్తా రన్నా రు. రాష్ట్రంలో 140– 150 నియోజక వర్గాల్లో టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు ఘనవిజయం సాధిస్తారన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయ్యి రాష్ట్ర ప్రజలకు సుప్రపాలన, రాష్ట్ర అభివృద్ధిని సాధిస్తారని జోస్యం చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసిపి ఘోర పరాజయం చెందు తుందనే ఉద్దేశంతోనే వైసీపీ నాయకులు హింసాత్మక దాడులకు పాల్పడ్డారని, టిడిపి నాయకులపై తప్పుడు కేసులు బనాయిం చారని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రగిరిలో వైసీపీ నాయకుల భూ కబ్జాలు, అవినీతి అక్రమాలు, ఇసుక మాఫియాలపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టి చిరంజీవి రెడ్డి, కే సోమశేఖర్ శెట్టి, అప్పిలి బాలకృష్ణ రాయల్, గోపి, సురేష్ రాయల్, కృష్ణారెడ్డి , సుబ్రహ్మణ్యం, గంగయ్య పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న గురజాల

దుర్గమ్మ గుడిలో జగన్మోహన్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: నగరంలోని స్థానిక గిరింపేట వద్ద గల దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారిని టీడీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పరామర్శ

13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజున వైసీపీ అల్లరి మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన 15వ డివిజన్ అధ్యక్షుడు రామినేని రామును టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ పరామర్శించారు. ఈ మేరకు శుక్రవారం ప్రశాంత్ నగర్‌లోని ఆయన నివాసానికి చేరుకుని ఆత్మీయంగా పలకరించారు. వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గురజాల మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నేతలు దాడులకు తెగబడ్డారని మండిపడ్డారు. టిడిపి కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెబుతామని అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని స్పష్టం చేశారు. రాము కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నేతలు ఈశ్వర బాబు, వెంకటేష్ యాదవ్, నూగల మధు బాబు, కోడి బాబు, డేగల రమేష్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి: ఏఐటీయూసీ

సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడానికి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం కార్మిక సంఘాల నేతల సమావేశం ఏఐటియుసి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థలలో వేలాదిగా పనిచేస్తున్న కార్మికులకు కనీసం వేతనం లేక, కార్మికులకు చట్ట ప్రకారం రావలసిన సౌకర్యాలు లేక, ప్రత్యేకంగా మహిళా కార్మికులకు చట్టం ప్రకారం రావలసిన ప్రత్యేక రాయితీలు అమలుకు నోచుకోలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కొన్ని సంస్థల్లో మగ, ఆడ కార్మికులనే తేడా లేకుండా వారి చేత 12గంటలు పని చేయించుకుంటూ శ్రమ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా మరో పదేళ్లు కొనసాగించాలి'

ప్రజాశక్తి-పుంగనూరు: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను మరో 10సంవత్సరాలు పెంచాలని జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్.సజ్జద్ బాషా శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జూన్ 2వ తేదీ నాడు 10 సంవత్సరాలు గడువు పూర్తి అవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని లేదు ఇంకా నిర్మించలేదు కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తుతమున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షురాలు పురందేశ్వరి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల అన్ని పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మరికొన్ని సంవత్సరాలు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ప్రకటింపు చేసుకోవాలన్నారు. మరి కొన్ని సంవత్సరాలు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా ఉండాలని కాంగ్రెస్ నాయకుడిగా బిజెపి కేంద్ర ప్రభుత్వంపై డిమాండ్ చేస్తున్నానన్నారు.

వేసవి శిక్షణా తరగతుల ముగింపు

ప్రజాశక్తి-గంగవరం: విలువలు లేని విద్య వలువలు లేని తెలుగు లాంటిదని తెలుగు సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు తులసినాథం నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కళామందిర్లో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత 15 రోజులుగా పలు అంశాలపై నిర్వహించిన వాటిపై విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపు పొందిన వారికి జ్ఞాపికలు ప్రశంస పత్రాలు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలం సమయాన్ని వృథా చేయకుండా కళామందిర్ తెలుగు భాష తరగతుల నిర్వహించి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారి నైపుణ్యతను గుర్తించి వారికి బహుమతులు ప్రధానం చేయడం సంతోషం కలిగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ప్రసాద్ రచయిత జొన్నవిత్తుల రామమూర్తి చంద్రశేఖర్ శ్రీపురం సీతారామయ్య కార్యదర్శి పుష్పలత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుంగనూరు ఆర్‌వోపై కలెక్టర్‌కి ఫిర్యాదు

ప్రజాశక్తి-పుంగనూరు: ఎన్నికల కోసం పుంగనూరు నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు పర్యటించేందుకు కోసం అద్దెకు తీసుకున్న వాహనాలకు ఇప్పటివరకు డబ్బులు చెల్లించక పోవడంతో వెంటనే కలెక్టర్ స్పందించి టాక్సీ డ్రైవర్లకు అద్దె డబ్బులు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు కోరారు. ఎన్నికల్లో వాడుకున్న వాహనాలకు, టాక్సీ డ్రైవర్ బాడుగ చెల్లించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విన్నవించారు. ఎన్నికల భాగంగా పుంగనూరు నియోజకవర్గంలో ఆర్వో ఆధ్వర్యంలో ఎన్నికల పోలింగ్ పూర్తయ్యే వరకు వాహనాలు అద్దెకి తీసుకోవడం జరిగిందన్నారు. కానీ ఎన్నికల పూర్తయి 20రోజులు గడుస్తున్నా వాహన యజమానులకు ట్యాక్సీ డ్రైవర్లకు అద్దె చెల్లించకపోవడం దారుణమన్నారు. అంతేకాకుండా ఆర్వో ఎంపీడీవో పైన, ఎంపీడీవో ఆర్వో పైన ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారు. తప్ప వారికి అద్దె చెల్లించింది మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ జోక్యం చేసుకొని డ్రైవర్ల సమస్యలు పరిష్కారం చేయాలని అలాగే జిల్లాలో ఎక్కడ ఉన్నా ఇలాంటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేసింది.

ఉద్యోగ విరమణ సన్మానం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మొగిలిప్ప శుక్రవారం ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక కార్యాలయంలో సన్మాన కార్యక్రమాన్ని తహశీల్దార్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగాన్ని కర్తవ్యంగా నిర్వహించి రాబోయే ఉద్యోగతనానికి మార్గదర్శక మొగిలిప్ప నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయన సేవలను కొనియాడుతూ దుశ్శాలువలతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. డిప్యూటీ తహశీల్దార్ ఫణికుమార్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని తన విధి నిర్వహణలో ప్రజలకు జవాబు దారితనంగా పనిచేసి ప్రజలు మనల్ని పొందారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి టి.సుబ్రమణ్యం, మండల, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షులు వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.